నవతెలంగాణ
ఆదిలాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 13, 2024 | www.navatelangana.com

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని స్టేషన్ పెద్దనపల్లి చెందిన మూడేడ్ల కావ్య(26) మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..కావ్యకు 2019లో మూడేడ్ల సాయికిరణ్‌తో వివాహం జరిగింది. ఈ నెల 5న బెల్లంపల్లిలోని జనని ఆసుపత్రిలో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. 8న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కాగా 11న ఆరోగ్యం బాగాలేదని మంచిర్యాల మెడిలైఫ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మరణించిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతురాలి సోదరుడు ఐలవేణి సాయిరోహిత్ చెల్లి మరణంపై అనుమానం ఉందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సీఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలోని రైస్‌మిల్లులకు సామర్థ్యాలకు అనుగుణంగా కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరం ఖరీఫ్‌కు సంబంధించి సీఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులతో పాటు రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.



నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈనెల 17న కాగజ్‌నగర్‌లో చేపట్టే వినాయక నిమజ్జన కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అధికారులకు సూచించారు. గురువారం స్థానిక పెద్దవాగు ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్, సీఐ శంకరయ్యలతో కలిసి ఆమె పరిశీలించారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాత్రి వేళల్లో ఇబ్బందులు ఏర్పడకుండా లైటింగ్ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటుచేసుకోవాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలన్నింటినీ తీసుకోవాలని సూచించారు.

వైద్యశిబిరాల సందర్శన

అనంతరం పట్టణంలోని ఓల్డ్ కాలనీ, సర్‌సిల్క్ కాలనీలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆమె సందర్శించారు. జ్వర పీడితుల నుండి రక్త నమూనాలు సేకరించి సరైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిసరాలను , తరగతి గదులను పరిశీలించారు. హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. వార్షిక ఫలితాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

నవతెలంగాణ- తాండూర్

నేర నియంత్రణ నిరూపణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని, వాటి ఏర్పాటుతో నేరాలు నియంత్రించడం జరుగుతుందని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. గురువారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బెల్లంపల్లి-2 పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాల్టెక్స్ ఏరియాలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని బైక్ షోరూమ్‌ల యజమానుల సహకారంతో 6సీసీ కెమెరాలు కాల్‌టెక్స్ బ్రిడ్జిపై ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించిన బైక్ షో రూమ్‌ల యజమానులకు అభినందనలు తెలిపారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఇవి ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చునని తెలిపారు. వ్యాపార వర్గాలకు సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తాయని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో చాలా కేసులు ఛేదించడం జరిగిందని తెలిపారు. కేసుల ట్రయల్ సమయంలో సీసీ కెమెరాలు సాక్ష్యంగా ఉపయోగపడతాయని తెలిపారు. నేర రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన సీఐ అఫ్జలుద్దీన్, ఎస్ఐ మహేందర్‌ను ఏసీపీ అభినందించారు.

వందేభారత్ రైలు నిలపాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 15 నుండి ప్రారంభమయ్యే సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందేభారత్ రైలును కాగజ్‌నగర్‌లో నిలుపాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌ను ఆదిలాబాద్ ఎంపీ జి నగేష్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కలిసి వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ రైలును కాగజ్‌నగర్‌లో నిలుపాలని ఈ సందర్భంగా వారు జీఎంకు వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రశాంతంగా గణపతి నిమజ్జనోత్సవం జరుపుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

గణపతి నిమజ్జనోత్సవం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తహసీల్దార్ సదానందం, ఎస్సై రాములు అన్నారు. గురువారం భీమారం మండల కేంద్రంలోని కొత్త చెరువు పరిసరాలను పరిశీలించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా విగ్రహాలతో తరలివచ్చే వాహనాల రాకపోకలు, విగ్రహాల నిమజ్జనం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఏర్పాట్లపై స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తితో చర్చించారు. అదే విధంగా చెరువు పరిసరాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు, పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనోత్సవానికి అందరు సహకరించాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో ఎన్నికలు

కాసిపేట: మండలంలోని మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించారు. 2024- 25 ఏడాదికి స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాధారణ ఎన్నికల విధంగా ఎన్నికల షెడ్యూల్, గుర్తులు కేటాయించి, బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పీహెచ్ లక్ష్మయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద మిగిల్చిన నష్టం..!

- తీవ్రంగా దెబ్బతిన్న పంటలు, రోడ్లు, కల్వర్టులు
- నిర్వేదంలో అన్నదాతలు..ప్రయాణాలకు అవరోధాలు
- సర్వే చేపట్టిన అధికారులు..తేల్చిన నష్టం లెక్క
- ప్రభుత్వానికి నివేదిక..సాయం కోసం ఎదురుచూపు

జిల్లాను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. పంట పొలాలను ముంచెత్తగా.. వాటి దాటికి పలు రోడ్లు కోతకు గురికాగా.. వివిధ చోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో చేతికొచ్చిన పంటలు వరద పాలు కావడంతో అన్నదాతల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఫసల్ బీమా సౌకర్యం కూడా లేకపోవడంతో పరిహారంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సాయంపైనే ఆశలు పెట్టుకున్నారు. మరోపక్క పలు చోట్ల రహదారులు, కల్వర్టులు, లోలెవల్ వంతెనలు సైతం కొట్టుకుపోవడంతో రోజుల తరబడి ప్రయాణాలకు అవరోధం ఏర్పడుతోంది. వీటిని బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం నష్టం వివరాలను తెలుసుకునేందుకు సర్వే చేపట్టింది. వ్యవసాయ, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సర్వే చేపట్టి నష్టం వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి పంపించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఏపుగా పెరుగుతున్న పంటలను నేలవాల్చాయి. నీటిలోనే మురిగిపోయేలా చేశాయి. ఆదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగా నది ఉప్పొంగి ప్రవహించడంతో పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలను ముంచెత్తింది. జైనథ్, బేల, భీంపూర్ తదితర మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కో రైతు సుమారు 5 నుంచి పది ఎకరాల వరకు పంటను కోల్పోవాల్సి వచ్చింది. పంట చేతికొచ్చే సమయంలో వరద రూపంలో నాశనం కావడంతో అన్నదాతల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఈ క్రమంలో ప్రభుత్వం అన్నదాతలను ఆదుకుంటామని భరోసా ఇచ్చింది. పంట సర్వేతో పాటు ఎక్కడెక్కడ నష్టం జరిగిందో వివరాలు నమోదు చేసి పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశంతో నష్టం వివరాలను తెలుసుకునేందుకు వ్యవసాయ, రోడ్లు, భవనాలశాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. పంటలతో పాటు రోడ్లు, కల్వర్టులు,లోలెవల్ వంతెనలు దెబ్బతినడంతో వీటికి మరమ్మతులు, శాశ్వత ప్రతిపాధికన పనులు చేపట్టాలంటే రూ.కోట్లలో నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

జిల్లాలో రూ.కోట్లలో నష్టం..!

జిల్లాలో వరదల కారణంగా రూ.కోట్లలో నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పెన్‌గంగా నదితో పాటు వివిధ వాగుల కారణంగా సుమారు 2300ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇందులో పత్తి పంట 2వేల ఎకరాల్లో ఉండగా.. సోయా, కంది తదితర పంటలు మరో 300 ఎకరాల్లో నష్టం జరిగిందని గుర్తించారు. రోడ్లు భవనాశాఖ పరిధిలో ఉట్నూర్ నుంచి ఇందన్‌పల్లి, జాతీయ రహదారి నుంచి గుబిడి, బోథ్ నుంచి అడెల్లి వెళ్లే రోడ్లతో పాటు వివిధ చోట్ల రోడ్లు, కల్వర్టులు, లోలెవల్ వంతెనలు కొట్టుకుపోయాయి. 116 కి.మి రోడ్లు దెబ్బతినగా, 26కల్వర్టులు, మరో 13 రోడ్లు కోతకు గురికావడం సంభవించింది. వీటి తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.90.89లక్షలు అవసరం కాగా..శాశ్వత ప్రతిపాధికన పనులు చేపట్టాలంటే రూ.120.78కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో 240వరకు రోడ్లు, కల్వర్టులు చెడిపోయాయి. వీటిని తాత్కాలిక పద్ధతిన పనులు చేపట్టాలంటే రూ.12.5కోట్లు అవసరం కాగా.. శాశ్వత ప్రతిపాధికన పనులు పూర్తిచేయాలంటే ఏకంగా రూ.344కోట్లు అవసరమవుతాయని అధికారులు నివేదిక రూపొందించారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులు ప్రభుత్వానికి పంపించినట్లు తెలిసింది. పంటలు దెబ్బతిని అన్నదాతలు, రోడ్లు, కల్వర్టులు చెడిపోవడం కారణంగా వివిధ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు





దెబ్బతిన్న ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగరం రోడ్డు

ప్రభుత్వానికి నివేదిక పంపించాం : నర్సయ్య, ఆర్అండ్‌బీ, ఈఈ, ఆదిలాబాద్

జిల్లాలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కల్వర్టుల వివరాలు తెలుసుకున్నాం. సర్వే పూర్తిచేసి నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. జిల్లాలో తాత్కాలిక, శాశ్వత ప్రతిపాధికన పనులు చేపట్టాలంటే అవసరమయ్యే నిధుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినాం. అక్కడ్నుంచి నిధులు రాగానే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

ఆప్యాయంగా పలకరించేవారు..

సీతారాం ఏచూరితో జిల్లా నాయకుల అనుబంధం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల పార్టీ జిల్లా నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమాలకు, పార్టీ పటిష్ఠతకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పార్టీ సమావేశాలు, మహాసభల సందర్భంగా కలిసినప్పుడు అప్యాయంగా పలకరించేవారని చెబుతున్నారు.



జాతీయ రాజకీయాలకే తీరని లోటు : దర్శనాల మల్లేష్, పార్టీ జిల్లా కార్యదర్శి



పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికే కాదు. యావత్ జాతీయ రాజకీయాలకు తీరని లోటు. లౌకిక భారత రాజ్యాంగ రక్షణ కోసం ఇండియా కూటమిని ఏర్పాటుచేయడంలో ఆయన పాత్ర కీలకం. దాని ఫలితమే ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద రాజకీయాలను కట్టడి చేయగలిగారు. ఆయన బోధించిన క్లాసులు పలుమార్లు ప్రత్యక్షంగా విన్నాను. హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆయన చేసిన ఉపన్యాసంతో శిక్షణ తరగతులు, సెమినార్లు విన్నాను. ఆయన బోధించే విధానం చాలా బాగా ఆకట్టుకునేది. మహారాష్ట్రలోని కిన్వట్‌లో జరిగిన మొదటి బహిరంగ సభలో ఆయన ఉపన్యాసాన్ని తొలిసారి విన్నాను. అంతర్జాతీయ కమ్యూనిస్టు రాజకీయాలకు కేంద్ర బిందువుగానూ పనిచేశారు. ఆయన తెలుగు వ్యక్తి కావడం మరింత గర్వించదగిన విషయం. నేటి రాజకీయ పరిస్థితుల్లో దేశానికి ఆయన సేవలు దూరం కావడం చాలా బాధాకరం. ఆయన మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.

కిన్వట్‌కు వచ్చినప్పుడు కలిశాం : లంక రాఘవులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గారితో 1986 నుంచి అనుబంధం ఉంది. జిల్లాకు సమీపంలోని కిన్వట్‌కు పలుమార్లు వచ్చారు. ఆ సమయంలో ఆయనతో కలిసి సభలో పాల్గొన్నాను. కలిసి భోజనం కూడా చేశాను. ఈ సందర్భంగా చాలా అప్యాయంగా మాట్లాడేవారు. జిల్లాలో పార్టీ చేపట్టిన ఉద్యమాలు, ప్రజల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకునేవారు. ఆదిలాబాద్‌కు రావాలని ఆహ్వానించాం. కానీ అప్పటి పరిస్థితుల దృష్ట్యా రాలేకపోయారు. విజయవాడలో నిర్వహించిన ఆల్‌ఇండియా మహాసభల్లో ఆయన అతిథిగా రాగా.. నేను డెలిగేట్‌గా పాల్గొన్నాను. హైదరాబాద్‌లోనూ 2002లో నిర్వహించిన ఆల్ ఇండియా మహాసభల్లోనూ ఆయనతో కలిసి పాల్గొన్నాను. రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చినప్పుడు కలిసిన సందర్భంలో అప్యాయంగా మాట్లాడేవారు. ఆయన మరణించడం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.

అప్యాయంగా పలకరించేవారు : బండి దత్తాత్రి, పార్టీ సీనియర్ నాయకుడు



పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గారితో అనేక ఏండ్లుగా అనుబంధం ఉంది. ఆయన ఆలోచనలు, పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉండే విధానం చాలా నచ్చేది. మహారాష్ట్రలోని కిన్వట్‌కు వచ్చిన సందర్భంగా ఆయన్ను కలిసే అవకాశం లభించింది. చాలా అప్యాయంగా పలకరించేవారు. హైదరాబాదులో నిర్వహించిన పలు సభలు, సమావేశాల సందర్భంగానూ పలుమార్లు కలిసి మాట్లాడినాం. జిల్లాలో పార్టీ స్థితిగతులు, ఉద్యమాల గురించి అడిగి తెలుసుకునేవారు. జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై ఆయనకు లోతైన అవగాహన ఉండేది. చాలా బాగా వివరించేవారు. ఆయన మృతి చెందడం, పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.

ఆయనతో ప్రత్యక్ష అనుబంధం ఉంది : తొడసం భీంరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు



పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గారితో ప్రత్యక్ష అనుబంధం ఉంది. 2009 నుంచి 2014 వరకు హైదరాబాదులోని పార్టీ కార్యాలయంలో నేను కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశాను. ఆయన హైదరాబాదుకు వచ్చినప్పుడు బస ఏర్పాట్లు, భోజనం తదితర వాటిని చూసుకునేవాళ్లం. కార్యాలయం బయటకు వెళ్లే సందర్భంలో చాలా అప్యాయంగా భుజం మీద చేయి వేసి మాట్లాడేవారు. కుటుంబ నేపథ్యం, పార్టీ పట్ల ఆకర్షితులైన విధానం గురించి అడిగి తెలుసుకునేవారు. ఊరిలో పరిస్థితులను కూడా తెలుసుకునేవారు. కుటుంబాన్ని ప్రేమించినట్లుగానే పార్టీని, ప్రజలని ప్రేమించాలని చెప్పేవారు. అప్పుడే ఉద్యమాల్లో ఉండగలుగుతామని సూచించేవారు. ఆయన మృతి చెందడం చాలా బాధాకరం. పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.

ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

కాగజ్‌నగర్: సీపీఐ(ఎం) అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గత కొన్ని రోజులుగా ఢిల్లీలోని ఎయిమ్స్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సీతారాం ఏచూరి గురువారం మృతి చెందిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా కూశన రాజన్న మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సీతారాం ఏచూరి రాజకీయాల్లోకి వచ్చారని, జెఎన్‌యు లాంటి విద్యాసంస్థను వామపక్ష ఉద్యమాలవైపు నిలిపిన ఘనత సీతారాం ఏచూరిదేనని అన్నారు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఒక తాటిపైకి తీసుకురావడంలో సీతారాం ఏచూరి పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు జాడి మల్లయ్య, ఊట్ల రవి, అంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కార్మిక క్షేత్రంలో మొదలైన దీపావళి బోనస్ చెల్లింపు చర్చ

నవతెలంగాణ-జైపూర్

దసరా పండుగా సమీపిస్తుండగా కార్మిక క్షేత్రంలో దీపావళి బోనస్ చెల్లింపు చర్చ మొదలైంది. కోలిండియాలో బోనస్ చెల్లింపు దసరా పండుగకు ముందు చేపడతారు. సింగరేణిలో మాత్రం దీపావళి పండుగకు ముందు ఈ బోనస్ చెల్లింపు పూర్తి చేస్తారు. ప్రతి ఏడాది సింగరేణి కార్మికులకు ఆనవాయితీగా దీపావళి బోనస్(పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్) కొనసాగుతోంది. బోనస్ చెల్లింపుపై కార్మికుల్లో రక రకాలుగా అంచనాలు వ్యక్తమవుతున్నాయి. దీపావళి బోనస్ చెల్లింపుల విషయమై అక్టోబర్ మొదటి వారంలో స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. గత సంవత్సరం స్టాండరైజేషన్ కమిటీ నిర్ణయించిన విధంగా కార్మికులకు రూ.85వేల చొప్పున యాజమాన్యం చెల్లించింది. ఏటా దీపావళి బోనస్ చెల్లింపులు పెంచుతూ వస్తుండగా ఈ ఏడాది రూ.లక్షకు కొంచెం అటూ ఇటుగా పెంచి చెల్లిస్తారనే అభిప్రాయాలు లేకపోలేదు. అయితే కార్మిక సంఘాలు మాత్రం రూ. లక్షకు పైగా పెంచి చెల్లింపులు చేపట్టాలనే డిమాండ్‌తో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే ప్రతిపాదనతో స్టాండర్డైజేషన్ కమిటీలో ప్రతిపాదించుటకు యూనియన్లు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. కాగా కోలిండియా లిమిటెడ్ నిఖర లాభం రూ. 10 వేల కోట్ల మేరకు పెరిగింది. అదేవిధంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో కోలిండియా రూ. 37.369 కోట్ల లాభం ఆర్జించగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి 773.63 మిలియన్ టన్నులుగా నమోదు చేసుకుంది. సింగరేణి యాజమాన్యం ఏటా నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ రెట్టింపు వృద్ధి రేటును నమోదు చేసుకుంటోంది. కార్మికులకు వార్షిక బోనస్‌గా ఏటా పెంచుతూ చెల్లిస్తోంది. గడిచిన 15 సంవత్సరాల్లో బోనస్ చెల్లింపులు పెంచుతూ వస్తుండగా 2013 సంవత్సరంలో రూ. 31,500 చొప్పున చెల్లించింది. 2014 సంవత్సరంలో ఏకంగా రూ. 8,500లు పెంచి రూ. 40 వేల చొప్పున బోనస్‌గా కార్మికులకు కానుకగా అందించింది. అదేవిధంగా 2015లో అదే ఒరవడిని కొనసాగిస్తూ గడిచిన సంవత్సరం మరో రూ. 8,500 పెంచి 2015 సంవత్సరంలో రూ. 48,500 చొప్పున దీపావళి బోనస్ చెల్లించింది. ఈ ఏడాది కూడా అధిక మొత్తం పెంచి రూ.లక్షకు పైగా పెంచి లక్ష అనే మైలురాయి దాటిస్తుందన్న ఆశాభావం కార్మికుల్లో వ్యక్తమవుతోంది. కార్మిక సంఘాలు సైతం ఇదే డిమాండ్‌తో స్టాండరైజేషన్ కమిటీ సమావేశంలో చర్చించి కార్మికులకు తీపి కబురు అందించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా దీపావళి బోనస్ చెల్లింపులతో కోలిండియాతో పాటు సింగరేణిలో సుమారు 2.5 లక్షల మందికి తోడ్పాటు లభించనుంది. 2007లో రూ.6,000 చెల్లించగా, 2023లో రూ. 85,000కు చేరింది. ఈ ఏడాది ఎంత చెల్లిస్తారనేది కార్మికులు ఎదురుచూస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ- బజార్‌హత్నూర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ కె.కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలతో పాటు అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. అంతేకాకుండా ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ, ల్యాబ్, డెలివరీ రూమ్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వైద్య సిబ్బంది ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీలు, ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలని సూచించారు. మండల వైద్యాధికారి భీంరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

2
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | సెప్టెంబర్ 13, 2024 | www.navatelangana.com

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ముధోల్



మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం తహసీల్దార్ శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు చర్మ వ్యాధులతో బాధ పడుతుండటంతో వారికి మంచి వైద్యమందించే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. వసతిగృహంలో పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే స్పందించాలన్నారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

తపస్ మండలాధ్యక్షుడిగా గెడం కేశవ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (తపస్) మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. దీనికి జిల్లా అధ్యక్షులు చవాన్ సునీల్ హాజరయ్యారు. మండలాధ్యక్షుడిగా గెడం కేశవ్, ఉపాధ్యక్షులు రూపావత్ రాంకుమార్, ప్రధాన కార్యదర్శి జాదవ్ మేఘనాథ్, కోశాధికారి రాథోడ్ శ్రీకాంత్, కార్యదర్శులుగా ఆడే కిరణ్, శ్యామల, విజయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యాలయాల పరిసరాల్లో పశువులు



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహం, జెడ్పీ ఉన్నత పాఠశాలల తరగతులు కొనసాగుతున్న సమయంలో పశువులను విద్యాలయాల పరిసరాల్లోనే పశువులను మేపటానికు పశువుల కాపరులు తమ పశువులను గ్రౌండ్‌లోకి రోజు తీసుకువస్తున్నారు. విద్యార్థులకు చదువుకునే టప్పుడు అటల సమయంలో చాలా ఇబ్బందిగా ఉంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోయారు. పశువులకాపరులకు ఎన్ని సార్లు చెప్పినా వినకపోవడమే కాక మాకే ఎదురు చెప్తున్నారు. గ్రౌండ్‌కు ప్రహరీ గోడ లేకపోవడం వల్లనే పశువులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల పరిసరాల్లో పూల మొక్కలు అహ్లాదకర మొక్కలను పశువులు తినేస్తున్నాయని అన్నారు. గతంలో ప్రజాప్రతినిధులకు తెలియజేశామని అన్నారు. గ్రామ ప్రముఖులు పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణానికి కృషి చేయాలని, పాఠశాల సిబ్బంది కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం



నవతెలంగాణ-భైంసా

పట్టణంలోని భైల్ బజార్ అంగన్‌వాడీ కేంద్రం-3లో పోషణ మాస కార్యక్రమాన్ని జరుపుకున్నారు. గర్భిణులకు, బాలింతలకు పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అదేవిధంగా బరువు తక్కువ ఉన్న పిల్లలకు పోషకాహార అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు టి.అర్చన ప్రభుత్వ వైద్యురాలు ఫిర్దోస్ జాబిన్, ఆశా కార్యకర్త రసిక, మౌనికలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌లు నియమ నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-నేరడిగొండ

రేషన్ డీలర్‌లు నియమ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ కలీం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని డీఆర్‌డీపో, రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీఆర్‌డీపో, రేషన్ డీలర్లు ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. పని వేళలు పట్టిక మీద రాయాలన్నారు. తూకం వేసేటప్పుడు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని అన్నారు. షాపుకు వచ్చే వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నాగోరావ్, మండలంలోని రేషన్ డీలర్‌లు పాల్గొన్నారు.

ప్రతి పేదవానికి రేషన్ కార్డు ఇవ్వాలి

నవతెలంగాణ-భైంసా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవానికి రేషన్ కార్డులివ్వాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేఎల్‌పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత పది సంవత్సరాల కాలంగా అప్పటి ఇప్పటి ప్రభుత్వాలు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడం మూలంగా ప్రజానీకానికి ఎంతో నష్టం జరిగిందన్నారు. 10 సంవత్సరాలుగా ఎన్నో కుటుంబాలు ఏర్పడ్డాయని, వారికి రేషన్ కార్డులు ఇవ్వకపోవడం మూలంగా సంక్షేమ పథకాలకు దూరమయ్యారన్నారు. ప్రభుత్వం త్వరితగతిన రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, బీజేపీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంతా కలిసి రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు.

15న ఉదారి నాగదాసు స్మారక కవితా పురస్కార ప్రదానోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు స్మారక కవితా పురస్కారాన్ని ఈ సంవత్సరం నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత పరిశోధకుడు డాక్టర్ బెల్లి యాదయ్యకు ఇస్తున్నట్టు కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఉదారి నారాయణ, నిర్వాహకులు కృష్ణమాచార్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే సభలో ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు సీడీ ఆడియో ఆవిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రదాన ఉత్సవ కార్యక్రమం ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవార్డు కింద రూ.5వేలతో పాటు ప్రశంసపత్రం ప్రధానం చేయబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వాగ్గేయకారుడు నా చిట్టి చేతులు చక్కని రాతలు ఫేమ్ చింతల యాదయ్య ప్రముఖ రచయిత పరిశోధకుడు విప్లవ కుమార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు, సాహితీ అభిమానులు అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ పట్టణంలో 11రోజులకు గణేష్ నిమజ్జనం చేయనున్నారు. దీంతో నిమజ్జన స్థలాన్ని గురువారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ పరిశీలించారు. గణేష్ నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. డీఎస్పీ వెంట సీఐ మొగిలి, ఎస్సై మనోహర్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొండరి రమేష్, నాయకులు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలు..!

- సమాచారంతో వైద్యశిబిరం ఏర్పాటు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలో జ్వరాలు రోజురోజుకు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వైరల్, మలేరియా, డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వర్షాల కారణంగా పారిశుధ్యంలో లోపించి వ్యాధులకు కారణమవుతున్నాయి. మండలంలో మారుమూల గిరిజన గ్రామాలైన మదనాపూర్, రేగులగూడ, నర్సాపూర్, గ్రామాల్లో గత వారం రోజుల నుంచి గిరిజనులు ఇంటికి ఒకరు ఇద్దరు చొప్పున మంచాన పడి వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. దగ్గు, జ్వరం, కీళ్లనొప్పులతో బాధపడుతున్నట్టు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదనపూర్ గ్రామంలో మనీషా(11), విశ్వాస్(4), కేరం లక్ష్మీబాయి(56), కేరం సంతోష్(26)తో పాటు మరికొంతమంది జ్వరంతో బాధపడగా రేగులగూడ గ్రామానికి చెందిన ఆత్రం కవిత(45), మడావి విజయ(50), మడావి, కనిబాయి(45), ఆత్రం లక్ష్మణ్(50), వీరితోపాటు ఈ మూడు గ్రామాల్లో 20మంది చొప్పున జ్వరాలతో బాధపడుతున్నట్టు తెలిపారు. చిన్న పెద్ద తేడా లేకుండా మంచాన బారినపడి ఎదురు చూడగా ఆర్థికంగా, బాగున్న కొంతమంది గిరిజనులు వైద్యం చేసుకోగా, మంచానికె పరిమితమై, నాటు వైద్యం, అదేవిధంగా దగ్గరున్న భరంపూర్ గ్రామానికి వెళ్లి ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేసుకుంటున్నారు. అయిన జ్వరాలు తగ్గడం లేదని ఆందోళన చెందుతున్నారు. గత కొద్ది సంవత్సరాల కింద చికెన్ గున్యా, మాదిరిగా కాళ్లు చేతులు తల విపరీతమైన నొప్పులు ఉన్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, రక్త నమూనాలను సేకరించి, తగు వైద్యం వెంటనే అందించాలని గిరిజనులు కోరుతున్నారు.

విలేకరి చొరవతో వైద్యులకు సమాచారం...

గిరిజన గ్రామాల్లో జ్వరాల విలేకరి వైద్యాధికారి డాక్టర్ హరిశ్‌కు అందించిన సమాచారం మేరకు వైద్యసిబ్బంది, గిరిజన గ్రామాలకు వెళ్లి వైద్యశిబిరం ఏర్పాటు చేసి, జ్వరాల బారినపడి మంచంలో ఉండి లేవలేని స్థితిలో ఉన్న వారికి వైద్యసేవలు అందించారు. రక్త నమూనాలను సేకరించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో సిబ్బంది శీతల్, అనిల్, లక్ష్మి పాల్గొన్నారు.





ఆటల్లో గెలుపోటములు సహజం



- అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభించిన ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆటల్లో గెలుపోటములు సహజమని, అంతేకాకుండా క్రీడ స్ఫూర్తిని చాటాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. అండర్ 14, 16, 18, 20 బాలబాలికల జిల్లాస్థాయి అథ్లెటిక్ ఎంపిక పోటీలను ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. దీనికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, రాష్ట్ర స్థాయికి ఎంపికై అక్కడ ప్రతిభ కనబర్చాలన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదిల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని, అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ ఆటలతోనే మానసిక, శారీరక దారుఢ్యం పెరుగుతుందని, పోటీల్లో గెలుపుతో పాటు క్రీడ స్ఫూర్తి కూడా ఉండాలని అన్నారు. పోటీల్లో ఓడిపోతే నిరుత్సాహం చెందకుండా మరింత సాధనతో మళ్లీ రాణించేలా సన్నద్ధం కావాలన్నారు. గెలిచిన వారు గర్వపడకుండా తమలోని నైపుణ్యాలతో మరిన్నీ పతకాలు, మెడల్స్ సాధించి జిల్లాకు పేరు సాధించాలని ఆకాంక్షించారు. పోలీసుల తరపున ఎలాంటి సహకారం కావాలన్న ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ సూర్యప్రకాష్, పేట సంఘం ప్రతినిధులు స్వామి, కోచ్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీలో మెరుగైన వైద్యమందిస్తున్నాం

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రిమ్స్ రోగులను రెఫర్ చేయకుండా సూపర్ స్పెషాలిటీలో మెరుగైన వైద్యమందిస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. గురువారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంకాలజీతో పాటు ఇతర సర్జరీల గురించి వివరించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీలో 9 రకాల వైద్య సేవలు అందుబాటులోకి ఉన్నాయన్నారు. ఇందులో ముఖ్యంగా యూరాలజీ, అంకాలజీ విభాగంలో ఇతర సర్జరీలు జనవరి నుంచి ఇప్పటి వరకు 2వేలకు పైగా చేశామన్నారు. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి అరుదైన ప్రక్కటెముక బోన్ కాన్సర్ (కాండ్రో సార్కోమా) నిర్ధారణ కావడంతో రోగిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కాన్సర్, ప్రత్యేక వైద్య నిపుణులు డా.జక్కుల శ్రీకాంత్ అరుదైన ప్రక్కటెముక బోన్ కాన్సర్ (కాండ్రో సార్కోమా) ఈ క్యాన్సర్ కణాలు గుండెకి, ఉపిరితిత్తుకి అతుక్కొని ఉండటంతో దీనిని కొన్ని గంటలపాటు శ్రమించి శస్త్ర చికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారని తెలిపారు. ఈ శస్త్ర చిక్కిత్స కార్పొరేట్ ఆస్పత్రులలో దాదాపు రూ.5 నుంచి 6 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ శస్త్ర చిక్కిత్స ను ఆయనకు పూర్తిగా ఉచితంగా చేయడం జరిగిందని ప్రస్తుతం రోగి కోలుకొంటున్నాడని తెలిపారు. ఈ శస్త్ర చికిత్స చేసినటువంటి వైద్యులకు సహాయ సిబ్బందిని డైరెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో రిమ్స్‌లో ఇలాంటి మరిన్ని అరుదైన శస్త్ర చిక్కిత్సలను చేయడం జరుగుతుందని తెలిపారు. రిమ్స్‌ను మరింత మెరుగైన వైద్యమందించేలా కృషి చేస్తున్నామని, జిల్లా ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, వైద్యులు కార్తీక్, శ్రీకాంత్, సహాయ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తిని పెంచేలా పుస్తక ప్రదర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తిని పెంచేలా పుస్తక ప్రదర్శన, విక్రయాలు ఉపయోగపడుతాయని సీబీఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం సీబీఆర్ పాఠశాలలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వివేక జాగృతి కార్యక్రమంలో భాగంగా పుస్తక ప్రదర్శన, విక్రయాలు చేపట్టారు. విద్యార్థులు ఉత్సహంగా పాల్గొని, పుస్తకాలను చూస్తు వాటిని కొనుగోళు చేశారు. ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ కారణంగా విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తి తగ్గుతుందని, ప్రిన్సిపల్ జీవన్‌రెడ్డి అన్నారు. వాటిని పెంచడానికి ఇలాంటి పుస్తక ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. మహనీయుల చరిత్రలు, వారి సూక్తులను విద్యార్థులు చదివితే మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. పుస్తకాలు చదవడం పిల్లలు అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శోభారెడ్డి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు ఆరే భూమన్న, కోశాధికారి నల్ల కోటేశ్వరరావు, సభ్యులు హన్మండ్లు, ఉదయ్, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

గణపతికి గరికతో నైవేద్యం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లోని ఎన్టీఆర్ మార్గ్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ గణేష్ మండలి వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం లక్ష గరికతో గణపతికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో సామూహిక లలిత సహస్రనామాలను పఠించారు. కార్యక్రమంలో కాలనీవాసులు కాసా పద్మావతి, కందుల భారతి, శివరాం సురేఖ, బచ్చు అరుణ, చిటిమల సునీత, తోడిశెట్టి శారద, పసుపుల సరిత, దేశెట్టి లక్ష్మి, దీకొండ రేఖ, పడిగెల సుజాత పాల్గొన్నారు.

వికలాంగులకు బస్సు పాస్ మేళా



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో నిర్మల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల అర్హులైన దివ్యాంగులకు బస్సు పాస్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులకు ఆర్టీసీ అధికారులు బస్‌పాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా బస్‌పాస్‌ల ఇన్‌చార్జ్ టివి రమణ మాట్లాడారు. వికలాంగుల బస్‌పాస్ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, రూ.50 చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది సిర్గాపూర్ సాయిరెడ్డి, వద్యాల రమేష్‌రెడ్డి, వికలాంగుల సంఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు సాకిపెల్లి సురేందర్, సట్టి సాయన్న, ఇసాక్, బండి పోతన్న, వికలాంగులు పాల్గొన్నారు.

ఉద్యమంలో మహిళా శక్తి



నవతెలంగాణ-నిర్మల్

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 52వ రోజుకు చేరుకుంది. గ్రామంలోని మహిళలు గురువారం పెద్ద సంఖ్యలో రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న మహిళలకు మాజీ సర్పంచులు గంగాధర్, కోడె చిన్నయ్య, నాయకులు పాల్దె అనిల్ సంఘీభావం తెలిపారు. మహిళలు ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా చేసిన నినాదాలు దీక్ష స్థలంలో హోరెత్తించాయి. ఈ సందర్భంగా ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేక పోరాటానికి రోజు రోజుకు మద్దతు పెరుగుతోందని, నిర్మల్ జిల్లాలోనే కాకుండా పక్క జిల్లాలో కూడా ఫ్యాక్టరీని గురించి చర్చించుకుంటున్నారని, ఫ్యాక్టరీని తరలించేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. నాయకులు, అధికారులు ఇకనైనా మేలుకొని ప్రజలకు కీడు చేసే ఫ్యాక్టరీని తరలించాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనులపై సర్వే



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడ, న్యూముధ్గల్, గ్రామం దగ్గర జాతీయ రహదారి 161 బాసర-భైంసా విస్తరణ పనుల్లో ఇండ్లు కోల్పోతున్న వాటిపై సర్వే నిర్వహించారు. తరోడ గ్రామంలో తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇండ్లు, స్థలాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ విలాస్, ఆర్‌ఐ నారాయణరావు పటేల్, మాజీ సర్పంచ్ అరిపోద్దిన్, స్థానికులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి ఆదివాసీ సంఘాల సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మహేష్‌ను గురువారం ఆదివాసీ సంఘాల నాయకులు శాలువాతో సన్మానం చేశారు. మండలంలో శాంతి పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. సన్మాన కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్, విద్యార్థి సంఘాల నాయకులు శంకర్, దయానంద్, రవీందర్, అనిల్, శివ, భీంరావ్, రాజేందర్, లింగేశ్వర్, రాజు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్, అడెల్లి గ్రామంలోని బాధిత కుటుంబాలను గురువారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. జామ్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కండెల భోజన్నను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అడెల్లి గ్రామంలో తలారి రాజలింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ రాంకిషన్ రెడ్డి, నాయకులు సుభాష్‌రావు, జీవన్‌రావు, రాంరెడ్డి, శంకర్, లక్ష్మీ నారాయణగౌడ్, మల్లేష్, భోజన్న వెంకటి ఉన్నారు.

మార్కెట్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-భైంసా

భైంసా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గణేష్ మండలి ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, మన పండుగల విశిష్టత తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. సరస్వతి శిశుమందిర్ సుభద్ర వాటిక, కిసాన్‌గల్లీ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలి కమిటీ ప్రముఖులు శివ కుమార్ బచ్చువార్, నగేష్, శేషరావు పటేల్, శివ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 13, 2024 | www.navatelangana.com

ఖమ్మం వరద బాధితులకు విరాళాల సేకరణ

నవతెలంగాణ-దహెగాం



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లాలో వరదలకు ఇండ్లు నీటిమయమయ్యాని వారికి అండగా నిలవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండలంలోని హత్తిని గ్రామంలో గురువారం విరాళాల సేకరించారు. డివైఎఫ్ ఐ జిల్లా నాయకురాలు మంజుల హత్తిని గ్రామ ప్రజలు స్పందించి విరివిరిగా విరాళాలు ఇచ్చారన్నారు. సేకరించిన విరాళాలు రాష్ట్ర కార్యాలయంలో అందజేసినంతరం బాధితులకు అందజేయడం జరుగుతుందని అన్నారు. విరాళాల సేకరణలో నాయకురాలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆకసం కవి సమ్మేళనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని వాసవి మందిర్‌లో ఆసిఫాబాద్ కవుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. సంఘం నెలపొడుపులో భాగంగా వినాయక చవితి ప్రత్యేకతపై కవులు వారి కవిత్వాన్ని చదివి వినిపించారు. పవిత్రతో పాటు భక్తి పాటలు కూడా చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు చిలువేరు వెంకన్న, ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్, ఉపాధ్యక్షులు రావుల వెంకటేశ్వర్, వాసవి క్లబ్ అధ్యక్షులు శంకర్, ఉపాధ్యక్షుడు ఎకరాల శంకర్, ఆసిఫాబాద్ కవుల సంఘం అధ్యక్షులు నల్లగొండ రమేష్, సభ్యులు గుర్రాల వెంకటేశ్వర్లు, ధర్మపురి వెంకటేశ్వర్లు, శ్రీనివాస సత్యనారాయణ, రాధాకృష్ణ చారి, జ్యోతి, సరిత, శ్రీలత, త్రివేణి పాల్గొన్నారు.

డబ్బులు పోగు చేసి.. రోడ్డు బాగు చేసి..



నవతెలంగాణ-దహెగాం

మండలంలో కొన్ని సంవత్సరాలుగా ప్రధాన రోడ్ల పరిస్థితి మరి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో విసుకు చెందిన స్థానిక యువకులు ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్ల పారిశుధ్యంపై మండల, జిల్లా స్థాయి అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీంతో స్పందించిన అధికారులు మండల కేంద్రంలో ప్రధాన రోడ్ల పరిస్థితిని పలు అంతర్గత రోడ్ల పరిస్థితిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కానీ ఇప్పటికే నెల రోజులు గడుస్తున్న ఎలాంటి మరమ్మతు పనులు ప్రారంభం కాకపోవడంతో చేసేదేమీ లేక యువకులే స్వచ్ఛందంగా నిధులను చేకూర్చుకున్నారు. రూ.1,20,000 పోగు చేసుకుని మండల కేంద్రం నుండి కలవాడకు వెళ్లే ప్రధాన రోడ్డు గుంతల మయం కావడంతో సిమెంటు కంకర కలిపి గురువారం మరమ్మత్తులు చేపట్టారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు నిధులు వస్తే చేస్తామంటున్నారని తెలిపారు. ఆ నిధులు వచ్చేదేప్పుడు పనులు అయ్యేదేప్పుడో అర్థం కాకనే సొంత నిధులతో తాము మరమ్మత్తులు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని ప్రధాన రోడ్లను బాగు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని యువకులు కోరుతున్నారు. దహెగం మండల కేంద్రంలో ప్రధాన రహదారులు వర్షాలకు రోడ్ల గుంతలు ఏర్పడి ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

మున్నేరు బాధితులకు విరాళాల సేకరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇటీవల ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదలకు గురైన బాధితుల కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడాం టికనంద్, గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ వరదకు సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. బాధితులకు అండగా ఉండే ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీష్ పాల్గొన్నారు.

ఏరియా వర్క్ షాపు టీబీజీకేఎస్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా వర్క్ షాపు కమిటీని ఎన్నుకున్నట్టు టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ మల్ రాజ్ శ్రీనివాసరావు తెలిపారు. ఫిట్ కార్యదర్శిగా గాజువేని శ్రీనివాస్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శిగా శేపూరి రమేష్, కమిటీ సభ్యులుగా వైకుంఠం కనకయ్య, రాములు, ట్రెజరర్‌గా సూరం వెంకటేశ్వర్లు ఎన్నికైనట్టు తెలిపారు. కమిటీ సభ్యులను ఏరియా వర్క్ షాపు డివైజీఎంకు పరిచయం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, ఏరియా కమిటీ నాయకులు రాజేశం, చంద్రయ్య, సలహాదారు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గణేష్ చందా వసూళ్లకు పాల్పడితే చర్యలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

గణేష్ చందా పేరుతో అమాయకుల నుండి డబ్బులు వసూలు చేసిన ఇబ్బందులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కమలాకర్ అన్నారు. బుధవారం రాత్రి కౌటాల మండలం గుడ్ల బోరి గ్రామానికి చెందిన హివార్కర్ శంకర్, అతని మిత్రుడు దంద్రీ బాలాజీ ఇద్దరు కలిసి చంద్రపూర్ హాస్పిటల్‌కి వెళ్లి తిరిగి ప్రయాణం చేస్తుండగా మండలంలోని వెంకట్రావుపేట్ గ్రామానికి చెందిన దంద్రీ విజయ్, దంద్రీ సాగర్, దంద్రీ మురళి, దంద్రీ మిథన్, కామ్డే విజయ్, దంద్రీ ఈశ్వర్ వాళ్ళని బెదిరింపులకు గురిచేసి వాళ్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఎవరైనా గణేష్ చంద పేరుతో అక్రమంగా వసూళ్లకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అట్టహాసంగా బాస్కెట్ బాల్ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

డబ్ల్యూపీఎస్, జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలలలో భాగంగా గోలేటిలోని శ్రీభీమన్న క్రీడా మైదానంలో బాస్కెట్ బాల్ డిపార్ట్‌మెంట్ క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా ముఖ్య అతిధిగా హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఖైర్‌గూడ పీఓ జట్టుపై ఎస్ఓ టూ జీఎం జట్టు గ్రూప్ గెలుపొందింది. కార్యక్రమంలో జనరల్ క్యాప్టెన్ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సింగరేణిలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సంస్థలో ఏడాది కాలానికి అప్రెంటిస్‌షిప్ కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఐటీఐ ఉత్తీర్ణులై నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగిన వారితో పాటు ఇంటర్మీడియేట్ ఒకేషనల్ కోర్సు చేసిన వారు అర్హులని అధికార ప్రతినిధి వెల్లడించారు. ఈనెల 23వ తేదీ వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటిస్‌షిప్ఇండియా.ఓఆర్‌జీ లేదా ఎస్‌సీసీఎల్‌మైన్స్.కామ్ ద్వారా దరఖాస్తు చేసుకుని సంబంధిత పత్రాలు, సర్టిఫికెట్లను ఈనెల 13 నుండి ఎంవీటీసీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వ్యాధుల నియంత్రణకు వైద్య శిబిరాలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కెరమెరి



వర్షాకాల సీజనల్ వ్యాధులు, విష జ్వరాల వ్యాప్తిని నియంత్రించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. గురువారం మండలంలోని కొఠారి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్‌తో కలిసి సందర్శించి వైద్య సేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంలో భాగంగా జిల్లాలోని 60 గ్రామాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటా జ్వర సర్వే నిర్వహించి అనుమానితులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించే విధంగా సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలలో పూడిక లేకుండా ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రై డే కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని, వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంలో పరిశుభ్రత ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ప్రజా సంక్షేమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ రాయితీ ఉత్తర్వులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దత్తుప్రసాద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆంజాద్ పాషా, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుకు పోరుబాట

- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుకు చేపట్టే పోరుబాట కార్యక్రమాలను జయప్రదం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ అన్నారు. గురువారం గోలేటి లోని వివిధ విభాగాలలో పని చేస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాల పెంపుదాలకై పోరుబాట కార్యక్రమంలో భాగంగా పోరుబాట కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా వివిధ విభాగాలలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు లేక, ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా కనీస వేతనాల జీఓలను గెజిట్ చేయకుండా కాలయాపన చేసిందని ఆరోపించారు. ప్రస్తుత గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కాంట్రాక్టు కార్మికులకు అనేక హామీలు ఇచ్చిన తొమ్మిది నెలల పాలనలో వాటిని అమలు చేయలేదన్నారు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలను పెంచుతున్న ప్రభుత్వాలు, కార్మికుల వేతనాలు పెంచకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కేంద్రం కూడా 2022 జనవరిలో కనీస వేతనాల జీఓ గడువు ముగిసిన, నేటి వరకు కొత్త జీఓను ఇవ్వకుండా కార్మికులను మోసం చేస్తుందన్నారు. సింగరేణి యాజమాన్యం 2022 సెప్టెంబర్‌లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా చేసిన అగ్రిమెంట్‌లోని అంశాలను నేటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాంట్రాక్టు కార్మికులపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని మండిపడాఆరు. సంఘం ఆధ్వర్యంలో వేతనాల పెంపుదాలకు పోరుబాట కార్యక్రమంతో ఇటు సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావడానికి సెప్టెంబర్ నెల మొత్తం ఆందోళన, పోరాటాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు గట్టు మహేందర్, కార్మికులు పాల్గొన్నారు.

కండ్లకు గంతలు కట్టుకొని నిరసన

- పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్




నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషంట్ కేర్, సూపర్‌వైజర్‌లకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నెలలుగా కార్మికుల వేతన బడ్జెట్ విడుదల చేయలేదని దీనితో ఏజెన్సీ కాంట్రాక్టర్లు సకాలంలో వేతనాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. చాలీచాలని వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే కార్మికుల జీవనం సాగేదేలా అని ప్రశ్నించారు. ఇంటి అద్దెలు నెలవారి ఈఎంఐలు పొదుపు సంఘాల చెల్లింపులు పిల్లల ఫీజులు కట్టుకోలేక మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న జిల్లా ఏరియా సీహెచ్‌ఎస్‌సీ ఆస్పత్రుల కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడడం సరికాదన్నారు. మానవత ధృక్పథంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా ప్రతినెల 5లోపు జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, ఏడు నెలల పెండింగ్ జీతాల బడ్జెట్ విడుదల చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు మల్లేష్, మురళి, సత్తార్, మమత పాల్గొన్నారు.

ఏజెన్సీలో చట్టాలను కఠినంగా అమలు చేయాలి

- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కుమురం మాంతయ్య
- గిరిజన మహిళపై లైంగిక దాడి చేసిన నిందితున్ని ఉరితీయాలి

నవతెలంగాణ-కౌటాల



ఏజెన్సీలో ఆదివాసులకు ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కుమురం మంతయ్య కోరారు. ఇటీవల ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి హత్య యత్నం చేసిన నిందితుడిని ఉరి తీయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఎస్సై మధుకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950లో వలస వచ్చిన వారిని జైనూర్ నుండి పంపించాలన్నారు. బతుకు దెరువు కోసం వచ్చిన వారు ఆదివాసులపై లైంగికదాడులకు పాల్పడున్నారని, ఈ విషయంలో ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండ నిందుతున్ని బహిరంగా ఉరి తీయాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆదివాసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వాంకిడి : జైనూర్ మండలంలో జరిగిన సంఘటన బాధితులను కఠినంగా శిక్షించాలని తుడుం దెబ్బ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళలకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏజెన్సీలో చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు ప్రకాష్, కేశవ్, శంభు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసిన నిందితుడిని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి బహిరంగంగా ఉరితీయాలని ఆదివాసీ మహిళా సంఘం మండల అధ్యక్షురాలు గంట ధనలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ మహిళపై జరిగిన సంఘటన నిరసిస్తూ తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై కమలాకర్‌కు నిందితుని కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైంగికదాడికి గురైన మహిళకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఖర్చులతో వైద్యం అందించాలని, కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఆదివాసులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసుతో పాటు ఆదివాసులపై అక్రమ అరెస్టులు ఆపివేసి వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పూజారి పద్మ, శాంత, అనిత, రాజేశ్వరి, పూలమ్మ, పద్మ, విజయ, శారద, ఆశ, శ్రీలత పాల్గొన్నారు.



కెరమెరి : జైనూర్‌లో జరిగిన ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలో ఆదివాసీ మహిళలు శాంతియూత ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ర్యాలీ గుండ కొనసాగుతూ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఎస్సై గుంపుల విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళాలు పాల్గొన్నారు.

ఏచూరి మరణం దేశానికి తీరని లోటు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ అన్నారు. ఏచూరి మరణానికి పార్టీ ఏరియా కమిటి సంతాపాన్ని ప్రకటించి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థి హక్కుల కోసం ఇందిరాగాంధీకి ఎదురు నిలబడి పోరాడిన గొప్ప వీరుడని కొనియాడారు. ఏచూరి జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో ఎస్ఎఫ్ఐ దేశంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని బలమైన విద్యార్థి సంఘంగా ఎదిగిందని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుండి పోరాటాలతో హక్కులు సాధించిన గొప్ప నేత మరణం దేశానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, నాయకులు టికనంద్, నిఖిల్, మశాశ్రీ, సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో రాణించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రీడ పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక ప్రక్రియకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్ల శంకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బాలబాలికల అథ్లెటిక్స్ పోటీల్లో 200 మందికిపైగా విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని వీరిలో 30 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏటీడీఓ చిరంజీవి, హెచ్ఎం జంగు, అథ్లెటిక్స్ కోచ్ ఎం.విద్యాసాగర్ పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-రెబ్బెన

గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, డీజే అనుమతి లేదని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాలకు డీజే అనుమతి లేదన్నారు. పెట్టితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకొని పోలీస్‌లకు సహకరించాలని కోరారు.

జిల్లాలో ప్రత్యేక వైద్య శిబిరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీజనల్ వ్యాధులను నియంత్రించడంలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 10వ తేదీ నుండి 23వ తేదీ వరకు వైద్య శిబిరాలు కొనసాగిస్తామన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే 241 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిబిరం పరిధిలో అనుమానితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించి దానికి సంబంధించిన, పూర్తి వివరాలతో నిర్థీత ప్రొఫార్మాలో నివేదిక అందించాలని తెలిపారు.

సీఎం చిత్రపటానికి పద్మశాలీల పాలాభిషేకం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఐఐహెచ్‌టీఎస్‌కు పెట్టడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలకు కూడా జిల్లాకు చెందిన ఆ మహనీయుని పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని చేనేత వృత్తిదారులకు రుణమాఫీ చేయడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీలను బలోపేతం చేసేందుకు నూతన సభ్యుల కోసం సభ్యత్వాలు తీసుకోవడంతో పాటు సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభాలో 30శాతం ఉన్న పద్మశాలిలకు సరైన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాసు మల్లయ్య, నాయకులు కోమటిపల్లి లింగయ్య, శ్రీకాంత్, ధర్మయ్య మోహన్, అనుమండ్ల శ్రీకాంత్, శైలేందర్, మహేష్, రామచందర్ తిరుపతి, రవీందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మంచిర్యాల
శుక్రవారం | సెప్టెంబర్ 13, 2024 | www.navatelangana.com

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-జైపూర్



సీజనల్‌గా వచ్చే వ్యాధులను అరికట్టడం కోసం వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని భీమారం మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉధ్యానవన శాఖ అధికారి కల్పన సూచించారు. భీమారం గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తితో కలిసి గురువారం మండల కేంద్రంలో పర్యటించిన ఆమె లండితండా ఏరియాలో కొనసాగుతున్న సానిటేషన్ పనులు పరిశీలించారు. గ్రామాల్లో నీరు నిలువలు లేకుండా చూడాలని ఆదేశించారు. రోడ్లు శుభ్రం చేస్తూ డ్రైనేజీల్లో మురుగు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల వ్యాప్తిని నివారించాలని, బ్లీచింగ్ పౌడర్, పినాయిల్ పిచికారి పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

కుట్టు మిషన్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో న్యాక్ ఆధ్వర్యంలో 30 మందికి కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం మండల తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి కుట్టు మిషన్ కిట్లు పంపిణీ చేశారు. కిట్టులో మూడు జాకెట్ పీసులు దారం గుండీలు, సూదులు, మిషన్ ఆయిల్ ప్యాకెట్లు ఉంటాయన్నారు. శిక్షణ పూర్తి అయినంతరం ఆ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు. న్యాక్ డైరెక్టర్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల ప్రభాకర్‌ను తహసీల్దార్ అభినందించారు.

ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-జన్నారం

ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకే రవి, మండల కార్యదర్శి అశోక్ కోరారు. సీపీఐ(ఎం) గ్రామ మహాసభల్లో భాగంగా గురువారం పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం అంబేద్కర్ భవనం దగ్గర పొన్కాల్ గ్రామ శాఖ మహాసభను నిర్వహించారు. అన్ని గ్రామాల్లో శాఖ మహాసభలు నిర్వహించి గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిపై ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు పార్టీ ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పోతు విజయశంకర్, కూకటికారి బుచ్చయ్య, కొండగుర్ల లింగన్న, గుడ్ల రాజన్న, కనకయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



నవతెలంగాణ-మందమర్రి

పేకాట ఆడుతున్న పలువురిని రామగుండం టాస్క్ ఫోర్స్ పోలీసులు, మందమర్రి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం అర్ధరాత్రి రాజీవ్ నగర్‌లోని బోరిగం వెంకటేశ్వర్లు తన నివాసంలో అక్రమంగా పేకాట ఆడిస్తున్నాడనే సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్, మందమర్రి పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురితో పాటు ఇంటి యజమాని వెంకటేశ్వర్లను అరెస్ట్ చేసి వారి నుండి రూ.8700 నగదు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడానికి శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉండాలని గ్రామాలు, పట్టణాలలో ఫామ్ హౌస్‌లలో ఇళ్లల్లో పేకాట, జూదం ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తెలిస్తే 8712656570, 8712656569లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

పూర్తి స్థాయిలో వైద్య సేవలందించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్ డివిజన్‌లో సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్కె 8 నస్పూర్ డిస్పెన్సరీలు ఉన్నాయని, ఈ ఆస్పత్రిలో సరైన వైద్యులు అందుబాటులో లేక కార్మికులు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలకు వెళ్తూ తీవ్ర ఆర్థిక దోపిడికి గురవుతున్నారని తెలిపారు. దేశానికి వెలుగులను పంచే నల్ల సూర్యలకు సరైన వైద్యం సకాలంలో అందించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమవుతుందని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్ ఏరియాలో ఎక్కువ మంది కార్మికులు పనిచేస్తున్నందున, వారి సంక్షేమం కోసం శ్రీరాంపూర్ డివిజన్‌లో 50 పడకల ఆస్పత్రిని నిర్మించి, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నాం

నవతెలంగాణ-తాండూర్

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కవిత, స్వరూపరాణి అన్నారు. గురువారం మండలంలోని గోపాల్ నగరం, మాదారం అంగన్‌వాడీ కేంద్రం మూడులో పోషణబి..పడాయిబి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రీ స్కూల్ పిల్లలకు చిత్రపటాల ఆధారంగా కథలను చెప్పించారు. ప్రతి తల్లి 3నుండి ఐదు సంవత్సరాల బిడ్డను అంగన్‌వాడీకి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కుసనపల్లి మీనా, ఆశ వర్కర్లు మల్లీశ్వరి, జయ, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

సింగరేణిలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తులు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలో ఏడాది కాలానికి అప్రెంటిషిప్ దరఖాస్తులను చేసుకోవాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులై నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగిన వారు, ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు చేసిన వారు అప్రెంటిషిప్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చని, సెప్టెంబర్ 23 అఖరు తేదని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటిషిప్‌ఇండియా.ఓఆర్‌జీ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌సీసీఎల్‌మైన్స్.కామ్ ద్వారా దరఖాస్తు చేసుకుని సంబంధిత ధృవపత్రాలతో ఆయా ఏరియాలోని వృత్తి శిక్షణ కార్యాలయాలలో అందజేయాలని సూచించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

వర్ష కాలం సీజనల్ వ్యాధులు ప్రబలే కాలమని, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శశికళ అన్నారు. గురువారం మండలంలోని కలమడుగు, మురిమడుగు, చింతలపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న బావుల్లో పంచాయతీ కార్మికులతో క్లోరినేషన్ చేయించారు. అలాగే డ్రైనేజీలను శుభ్రం చేయించి చెత్తను తొలగించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించాలని ఆమె కోరారు. ఆమెతో పాటు ఎంపీఓ జలంధర్, కార్యదర్శి ఉన్నారు.



మహిళా సాధికారతతోనే అభివృద్ధి

- కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓల్డ్ ఐకేపీ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం స్వయం సహాయక మహిళా సంఘం సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు సామాజికంగా, ఆర్థికంగా తదితర అన్ని రంగాల్లో ముందుండలానే లక్ష్యంతో మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో క్యాంటీన్స్, మిల్క్ పార్లర్స్, రైస్ మిల్స్ నిర్వహణ వంటి బాధ్యతలను అప్పచేప్పిందని ఇందుకు గాను స్వయం సహాయక గ్రూప్‌ల ద్వారా రుణాలను అందిస్తు వ్యాపార రంగంలో రాణించేల ప్రోత్సహిస్తుందన్నారు. క్యాంటిన్‌లలో నాణ్యమైన పదర్థాలను ఉంచాలని సూచించారు. చెన్నూర్, మంచిర్యాలలో కూడ ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్స్, మిల్క్ పార్లర్లు ఏర్పాటు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి సూచించారు. ముందుగా ఉత్కూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి మిల్క్ పార్లర్‌ను ప్రారంభించారు. క్యాంటీన్ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అడిషనల్ డీఆర్డీఓ వెంకటేశ్వర్లు, మండల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వెంకటరమణ, ఏపీఎం లక్ష్మి, సీసీలు లచ్చన్న, వసంత లక్ష్మి, సురేందర్, సుమలత, రాజమణి పాల్గొన్నారు.

ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ జారీకి వినతి



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన పోడు భూమి పట్టాలు కలిగిన నిరుపేద రైతులు ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ జారీ చేయాలని ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ పుల్గం తిరుపతి ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ నిరుపేద పోడు రైతులకు తెలంగాణ ప్రభత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. ప్రభుత్వం నుండి సాయం కూడా అందుతుందన్నారు. బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ జారీ చేసి రైతులకు రుణాలు అందే విధంగా సహకరించాలని కోరారు.

ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా కలిగిన రైతులకు రుణాలు మంజూరు చేయాలి

ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన గిరిజన రైతులకు షరితులకులోబడి రుణాల అందించాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. గురువారం తన కార్యాలయానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్ట కలిగిన రైతులకి ఎంజాయ్‌మెంట్ సర్టిఫికేట్ అవసరం లేకుండా ఒరిజినల్ ఆర్ఓఎఫ్ఆర్ పట్ట చూసి క్రాప్ లోను ఇవ్వాలని ఐటీడీఏ పీఓ లెటర్ రూపంలో చెప్పడం జరిగిందని తెలిపారు. అయిన జిల్లాలలోని కొన్ని మండలాలలో బ్యాంక్ మేనేజర్లు అవగాహన లోపంతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలపై అవగాహన లేని బ్యాంకు అధికారులు రుణం మంజూరు చేయడానికి ఎంజయ్‌మెంట్ సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి రైతులను పంపడం సరికాదన్నారు. ఐటీడీఏ పీఓ ఉత్తర్వులను పాటించి రైతులకు రుణాల అందించాలని తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు.. అప్రమత్తమైన అధికారులు

- గ్రామాల వారీగా విస్తృతంగా పర్యటిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ
- గ్రామ పంచాయతీలలో ముమ్మరమైన పారిశుధ్య పనులు

నవతెలంగాణ-జైపూర్



వర్ష కాలంలో సీజనల్ వ్యాధులు, వరదలు తదితర వాటిపై కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో మండల స్థాయిలో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరం చేస్తున్నారు. భీమారం ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు చేపట్టిన జైపూర్ ఎంపీడీఓ సత్యనారాయణ గౌడ్ గురువారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. అదేవిధంగా జైపూర్ ఎంపీఓ శ్రీపతి బాపు రావు మండల పరిధిలో పర్యటిస్తూ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. విస్తారంగా కురిసిన వర్షాలకు తోడు గ్రామాల్లో నమోదవుతున్న జ్వరాల వ్యాప్తిని అరికట్టాలనే లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనుల నిర్వాహణలో అవసరమైన చోట అదనంగా కూలీలను ఏర్పాటు చేస్తున్నారు. జైపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పారిశుధ్య కార్మికులకు తోడు కూలీలతో పిచ్చి మొక్కలు తొలగించారు. అదేవింగా గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించారు. నర్వ గ్రామ పంచాయతీని సందర్శించిన ఎంపీఓ పారిశుధ్య పనులు పరిశీలించడంతో పాటు సీజనల్ వ్యాదుల పట్ల అవగాహణ కల్పించారు. దాంపూర్, ధర్మారం గ్రామ పంచాయతీలో పర్యటించిన ఎంపీడీఓ సత్యనారాయణ నిల్వ నీటి తొలగింపు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. అదే విధంగా గ్రామ పంచాయతీల్లో వార్డుల వారిగా సాయంత్రం ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్, సున్నం, బయోటెక్స్ పిచికారి ముమ్మరంగా కొనసాగాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీలలో నమోదవుతున్న జ్వర పీడితుల తీరును వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి, ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ కోరారు. గురువారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నియోజకవర్గ సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన విద్యారంగ సంస్కరణలపై జరిగిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో 9 పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసి వేగవంతంగా పనులు ప్రారంభించాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. అందులో ఆదిలాబాద్, బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు స్థానం కల్పించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం కార్మిక, కర్షక, ఆదివాసీ, గిరిజనుల నివాస క్షేత్రమైన ఆదిలాబాద్, బెల్లంపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలనూ అప్ గ్రేడ్ చేయకపోవడం సరికాదన్నారు. ఎన్నికల ముందు ఇంద్రవెల్లి సభ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప సంఘం సమీక్ష సబ్ కమిటీ సభ్యురాలు సీతక్క ఆదిలాబాదులో విద్య అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బెల్లంపల్లిలో ప్రారంభించాల్సిన మెడికల్ కాలేజిని మధ్యలోనే ఆపేసారని, ఇంజనీరింగ్ కాలేజీలు, ఇతరాత్ర కాలేజీలు రాకుండా ఇక్కడి విద్యా వ్యాపార వేత్తలు, ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో శేఖర్, నరేష్, శ్రావణ్, సతీష్, రమేష్, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక వినాయక చవితి

- అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాల-నవతెలంగాణ

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిక గణపతి పూజాని అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో చున్నంబట్టి వాడలో గల అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు గణపతి పూజా వేడుకలా జరుపుకోవడం మన సంప్రదాయానికి ప్రతిక అన్నారు. అంజనీ పుత్ర సంస్థ సేవలు అభినందనీయమన్నారు. అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ లోక క్షేమం కోసం పూజలు, అన్నదానాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఎండీ పిల్లి రవి మాట్లాడుతూ ఆ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంజనీ పుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎస్ కిషన్, సదానందం పాల్గొన్నారు.

లాభాల వాటాను సమానంగా ఇవ్వాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల వాటాను భూగర్భ కార్మికులతో సమానంగా ఓసీ కార్మికులకు కూడా ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఓసీపీ ఫిట్ సెక్రటరీ శ్రీపతి బానేష్ ఆధ్వర్యంలో అన్ని యూనియన్ల పిట్ సెక్రటరీలతో కలిసి మేనేజర్ బ్రహ్మాజీరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ లాభాలు సాధించడంలో భూగర్భ కార్మికులతో సమానంగా ఉపరితల గనిలో పనిచేస్తూ ఉత్పత్తి సాధిస్తున్న ఉద్యోగస్తులకు లాభాల వాటాలో వివక్షత చూపిస్తుందన్నారు. భూగర్భ, ఉపరితల గని కార్మికులందరికీ ఒకేలా సమానంగా వాటాను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ మోతే లచ్చన్న, ఐఎన్టీయూసీ పిట్ సెక్రెటరీ జాన్సన్, హెచ్ఎంఎస్ ఏరియా అధ్యక్షుడు జీవన్ జోయల్, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ కందుల శంకరయ్య, బీఎంఎస్ పిట్ సెక్రెటరీ నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు

ప్రశాంతంగా ముగిసిన స్పాట్ కౌన్సెలింగ్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఆదిలాబాద్ జోనల్ పరిధిలోని గురుకుల పాఠశాలలోని మిగిలిన సీట్లకు భర్తీకి నిర్వహించిన స్పాట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగిందని జోనల్ ఆఫీసర్ అరుణకుమారి తెలిపారు. లక్షెటిపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5 తరగతి 34 సీట్లు, 6లో 32 సీట్లు, 7లో 19 సీట్లు, 8లో34 సీట్లు, 9 తరగతిలో 64 మిగిలిన సీట్లకు ఉమ్మడి జిల్లాలోని ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల విద్యార్థులు స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా జోనల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఖాళీలు ఎస్సీ విద్యార్థులకు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. దాదాపు 650పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించినంతరం ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. ఉదయం నుంచి మొదలైన ఈ కౌన్సెలింగ్‌లో వివిధ జిల్లాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమా కల్యాణి, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల్లో పనులను తనిఖీ చేసిన డీపీఓ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొండాపూర్, తాటిగూడ, ధర్మారావుపేట గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పనులను గురువారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలలో నిర్వహించే పారిశుధ్య పనుల పరిశీలించారు. గ్రామ పంచాయతీలో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, నీరు నిలువ ఉంటే ఆయిల్ బాల్స్, బైలార్వల్, బయోటెక్స్ లాంటివి స్ప్రే చేయించాలని, కాలువలలో నీరు నిలవకుండా మట్టిని తొలగించి ఆ మట్టిని గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తరలించి కాలువల చుట్టూ బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని ఆదేశించారు. ఇళ్లలో నుంచి వచ్చే చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను అందించాలని, అంతే తప్ప బయట పడేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా ఇంటి చుట్టుపక్కల ఖాళీ డబ్బాలు సీసాలలో వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తగా చూసుకోవాలని వాటి ద్వారా దోమలు పెరిగే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించారు. డీపీఓ వెంట డీఎల్పీఓ షేక్ సఫ్దర్ ఆలీ, ఎంపీడీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కళాశాలలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి ఈ. మారయ్యా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల19, 20 తేదిల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చెయ్యడం జరగుతుందన్నారు. ఈ పోటీలు అండర్ 14, 16, 18, 20 బాలబాలికలకు ఉంటాయని, పోటీలకు వచ్చే క్రీడాకారులు జనన ధృవికరణ పత్రలతో ఉదయం 7.30లకు రిపోర్టు చేయ్యాలన్నారు.

నేడు శాంతి కమిటీ సమావేశం

నవతెలంగాణ-తాండూర్

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు తాండూర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో గణేష్ నిమజ్జనం శోభాయాత్ర సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలు సలహాలు సూచనలు చేస్తామన్నారు. తహసీల్దార్, సీఐ, ఎంపీడీఓ, విద్యుత్తు శాఖ, సంబంధిత శాఖ అధికారులు హాజరవుతారని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, మత పెద్దలు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పరిశుభ్రంగా ఉంచడమే ధ్యేయం

నవతెలంగాణ-నార్నూర్



వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచడమే ధ్యేయమని ఎంపీఓ స్వప్నశీలా అన్నారు. గురువారం మండలంలోని తాడిహత్నూర్, ఎంపల్లి, కొత్తపెల్లి(హెచ్), గంగాపూర్ గ్రామాల్లో పారిశుధ్య పనులను, సానిటేషన్, బావుల్లో క్లోరినేషన్‌ను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎంపల్లి గ్రామంలో గ్రామంలో నీటి సమస్య ఉండటంతో భగీరథ అధికారులతో మాట్లాడి పైప్ లీకేజి ఉన్న చోటసరి చేయించారు. మోటారు బిగించి నీటి సరఫరా చేయించారు. ఆమె వెంట కార్యదర్శులు దినేష్, నిరజ్ ఉన్నారు.

సీతారాం ఏచూరి మరణం పీడిత వర్గ పోరాటాలకి తీరని లోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పీడీత, తాడిత వర్గ ప్రజల పోరాటాలకి, ప్రజా ఉద్యమాలకి తీరని లోటని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు పెచ్చరిల్లుతున్న వారి కబంద హస్తాలలో ప్రజలు నలిగిపోతున్న తరుణంలో శ్రామిక శక్తులను ఏకం చేసి శ్రామికవర్గ పోరాటాలు బలోపేతం చేయాల్సిన ప్రస్తుత సమయంలో ఆయన మరణం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతానికి చివరివరకు కట్టుబడి కార్యదీక్షతో ఉద్యమాలకి ఊపిరి పోసిన ఏచూరికి ఉద్యమ జోహార్లు అర్పిస్తున్నామని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల కొట్లాట



నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు బుధవారం రాత్రి కొట్టుకున్నట్టు తెలిసింది. అయితే ట్రిపుల్ ఐటీలో భద్రతను నిరంతరం పర్యవేక్షణ కోసం నియమించిన సీఐ పట్టించుకోకపోవడంతో సమస్య జఠిలంగా మారినట్టు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ట్రిపుల్ ఐటీలో చదువుకుంటున్న జూనియర్, సీనియర్ విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. విద్యార్థుల పాత గొడవలతో దాడి చేసుకున్నారా, లేదా ఇంకా వేరే కారణాలు ఏమైనా ఉండొచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొన్నటి నిరసనలో పాల్గొన్న విద్యార్థులను ఇబ్బంది పెట్టడానికి ఈ దాడికి కారణం కావచ్చుని పలు విద్యార్థి సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఎప్పుడు కలిసిమెలిసి ఉండే విద్యార్థులు కొట్టుకోవడంలో యజమాన్యం పాత్రపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ట్రిపుల్ ఐటీలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర కొనసాగుతుండగా ఈ ఘటన జరిగిన్నట్లు సమాచారం. ఈ ఘటన విషయం ట్రిపుల్ ఐటీ ఎఓ దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ సంఘటనపై బాసర ఎస్సై గణేష్‌ను గురువారం సాయంత్రం నవతెలంగాణ ఫోన్లో వివరణ కోరగా ట్రిపుల్ ఐటీలో గొడవ జరుగుతున్నట్టు 100 డయల్ రావటంతో తమ సిబ్బందితో ట్రిపుల్ ఐటీకి వెళ్లడం జరిగిందన్నారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని వివరణ ఇచ్చారు.

మొబైల్ యూనిట్ వైద్యులకు నియామక పత్రాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధానమంత్రి జన్ మన్‌లో భాగంగా ఒప్పంద పద్ధతిన మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా ఐదుగురు వైద్యులకు నియామక పత్రాలను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు చెన్నకేశవలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాలు, పీవీటీజీలు నివసిస్తున్న గ్రామాలలో మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాల ద్వారా వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం సమీక్షించాలని, పోషకాహార లోపం, రక్తహీనత, బీపీ, మధుమేహ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీఎం విశ్వకర్మ పథకంపై ఆయా కులవృత్తుల వారికి అవగాహన కల్పించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో దరఖాస్తు, యూనిట్ల స్థపాన, రుణాలు తదితర వాటిపై ప్రొజెక్టర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కుల వృత్తుల వారు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు సూచించారు. పథకం ద్వారా లబ్ధి పొందడానికి కులవృత్తుల వారికి పలు విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందని, రుణాలు పొందాలన్నారు. ఎలాంటి సమస్యలున్న సంబంధిత శాఖల అధికారులను సంప్రదిస్తే సందేహాలను నివృత్తి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, ఆయా కుల సంఘాల నాయకులతో పాటు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ సిబ్బందికి పెండింగ్ ఎరియర్స్ చెల్లించడంతో పాటు ఇతర మునిసిపాలిటీలలో చెల్లిస్తున్నట్లు కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని మున్సిపాలిటీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి రెండో తేదీన ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా అవతరించిదన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను అప్పటి నుండి కేటగిరీల విభజించాలన్నారు. కార్మికుల వేతనాలను నిర్ణయించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర మున్సిపాలిటీలో ఇస్తున్న వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆవిర్భావం నుంచి ఉన్న పెండింగ్ ఏరియర్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాట్ల రాజు, కార్యదర్శి సమ్మయ్య, కోశాధికారి బాబురావు, నాయకులు సురేష్, నగేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గురువారం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేసిన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం తెలిపారు. కార్యక్రమంలో కోటయ్య, కునాల్, చంద్రకాంత్, పృథ్వి, గోపాల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏమాయికుంటను మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని ఏమాయికుంట గ్రామపంచాయతీని మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామని, జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టర్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సరస్వతి స్టీల్ ప్రారంభించి, ప్లాస్టిక్‌ని నివారించి, పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. శ్రీ ఇంద్రాయి మహిళా మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామంలో శుభకార్యాలు జరిగినప్పుడు ప్లాస్టిక్ వస్తువులు వాడకుండా స్టీల్ గ్లాసులు, ప్లేట్స్, తదితర వాడుకోవాలని దీనివల్ల ప్లాస్టిక్‌ని నివారించవచ్చని తెలిపారు. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పనులను త్వరలోనే నిర్మించడం జరుగుతుందని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామస్తులు అందరి భాగస్వామ్యంతో అన్ని మౌళిక సదుపాయాలు ఏర్పరచుకొని మోడల్ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్డీఓ సాయన్న, ఎంపీడీఓ, భాస్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవం శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎస్పీ డా.జానకి షర్మిల
- సర్వజనిక్ గణపతికి పూజలు
- నేడు నిమజ్జనోత్సవం

నవతెలంగాణ-ముథోల్



మండల కేంద్రంలో శుక్రవారం గణేష్ నిమజ్జనం జరుగనున్న నేపథ్యంలో గురువారం శోభయాత్ర జరుగనున్న రూటు మ్యాప్‌ను జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిలా పరిశీలించారు. బైంసా అదనపు ఎస్పీ అవినాష్ కుమార్, సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్‌లకు పలు సలహా సూచనలను తెలియజేశారు. అనతరం ముథోల్‌లోని రాం మందిరంలో ఏర్పాటు చేసిన సర్వజనిక్ గణేష్ మండపం వద్ద ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గురువారం జరిగే నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగా కుండా 200మంది పోలీసు బందోబస్తు చేస్తున్నారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవం జరుపుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలను, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక గజ ఈతగాళ్ళ ను నిమజ్జనం ప్రాంతంలో అందుబాటులో ఉంచామని, శోభాయాత్ర వెళ్లేమార్గంలో ఇతర శాఖల సమన్వయంతో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేష్, గౌరవాధ్యక్షుడు సుదర్శన్, సభ్యులు కోరి పోతన్న, తాటివార్ రమేష్, సాయినాథ్, మోహన్ యాదవ్, జి.నారాయణ, ధర్మేందర్ దేశ్ ముఖ్, పూజారి మధుకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు సూచించారు. గురువారం ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, పరిసరాలు, రిజిస్టర్లు పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాల పరిసరాలు, గదులు, మూత్రశాలలు, భోజనశాల, వంటశాల శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వింత గేదె దూడ జననం



నవతెలంగాణ-హజీపూర్

మండలంలోని నంనూర్ గ్రామంలో వింత గేదె దూడ జన్మించింది. గ్రామంలో రైతు మేకల బాపుకు చెందిన గేదె మొదటి ఈతలో మూడు రోజుల క్రితం కాళ్ళ లేని దూడకు జన్మనిచ్చింది. ఆ దూడ పాకుతూ తిరగడం చూస్తున్న గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దూడ ఆరోగ్యంగా ఉంది. ఈ విషయమై మండల పశు వైద్యాధికారిణి శాంతిరేఖను సంప్రదించగా పశువులలో ఏదైన కాళ్ల లేకుండా పుట్టడం వంటి ప్రక్రియను ఆమెలియా అంటారు. పూర్తిగా నాలుగు కాళ్ల లేకపోతే టెట్రా ఆమెలియా అంటారన్నారు. ఇది గర్భంలో పిండం ఎదిగే సమయంలో కాళ్ల ఏర్పడటానికి దోహదపడే జన్యు లోపం వల్ల ఇలా జరుగుతుందని ఆమె వివరించారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఏచూరి మృతికి సీపీఐ(ఎం) సంతాపం
- జెండాను అవనతం చేసిన పార్టీ కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కట్టుబడి ఉండి కృషి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. గురువారం ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తున్నట్టు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో పార్టీ జెండాను అవనతం చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి చనిపోయే వరకు వామపక్ష భావాలతోనే నడిచారని గుర్తుచేశారు. ప్రజా ఉద్యమాల్లో పార్లమెంటరీ ఉద్యమాల్లో ఆయన ఎప్పుడు ప్రజల పక్షానే ఉద్యమించారని తెలిపారు. కార్మిక కర్షక ఉద్యమాల వాణిని వినిపించి అనేకసార్లు ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచారని అన్నారు. పేద ప్రజల ఐక్యత కోసం కుల, మత వైశ్యామ్యాలు లేని భారత సమాజం కోసం కృషి చేశారని అన్నారు. ఆయన మృతి సీపీఐ(ఎం) పార్టీకి, భారత ప్రజానీకానికి తీరనిలోటని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, అన్నమొల్ల కిరణ్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల నాయకులు సురేష్ పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో ఒకరికి 20 ఏండ్ల జైలు

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రేమ పేరుతో పెండ్లి చేసుకుంటానని తప్పుడు వాగ్దానాలు చేసి బాలికపై పలుమార్లు లైంగికదాడి చేసిన కేసులో ఒకరికి 20 ఏండ్లు జైలు శిక్ష విధిస్తూ, పోక్సో కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన దుర్కే బాలాజీ నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామంలో భార్య పిల్లలతో ఇటుక పనిచేస్తు జీవనం సాగిస్తున్నడు. మహారాష్ట్రకు చెందిన బాలాజీ కూతురుపై మధ్యప్రదేశ్ చెందిన చాంద్ కుమార్ ఓ మైనర్ బాలికకు మోసపూరిత మాయ మాటలు చెప్పి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఫిర్యాదు చేయగా, 2023లో కేసు నమోదు చేసి, నేరస్తుడిని అరెస్టు చేసి, చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేయగా, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి 15 మంది సాక్షులను విచరణ చేశారు. సాక్షం కోర్టులో రుజువు కావడంతో నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి నేరస్తుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష విదిస్తూ, దానితో పాటు రూ.15వందల జరిమానా విధించారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచాడు. ఇతని పార్థీవదేహాన్ని జిల్లా ఎస్పీ గౌస్ అలం సందర్శించి నివాళ్లులర్పించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 13, 2024 | www.navatelangana.com

పథకం ప్రకారమే దాడులు : జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో ప్రతిపక్ష నాయకులపైన పథకం ప్రకారమే దాడులు జరుగుతున్నాయని మాజీ మంత్రి జోగు రామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి, పువ్వాడ అజయ్‌లపై కాంగ్రెస్ నాయకులు వరుసగా దాడులు చేయడం సిగ్గుమాలిన చర్యని అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని ప్రభుత్వం హౌస్ అరెస్ట్ చేసిన గాంధీ మాత్రం తన అనుచరులతో మీడియా ముందు కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్తున్ననాని బహిరంగగా ప్రకటించి, అసభ్య పదజాలాన్ని మీడియా ముందు వాడటం నేటి తరానికి ఆయన ఇచ్చే సందేశమేంటని ప్రశ్నించారు. ఇంటి నుంచి కౌశిక్‌రెడ్డి ఇంటివరకు పోలీసులు అడ్డుకోకుండా చోద్యం చూడటం ప్రజాస్వామ్య పాలన దెబ్బతింటుందన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు లేని నియంత పాలన కొనసాగుతుందని, ప్రజాస్వామిక విలువలను తుంగలో తొక్కి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. సహచర ఎమ్మెల్యే అని చూడకుండా రేవంత్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అహంకారంతో స్వయంగా దాడికి పాల్పడిన అరికేపూడి గాంధీ సంఘటన పట్ల బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ అధికారుల పొలం బాట

నవతెలంగాణ-లక్సెట్టిపేట



మండలంలోని మోదెలలో విద్యుత్ అధికారులు గురువారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈ గణేష్ సిబ్బందితో పొలాలకు వెళ్లి వంగిన విద్యుత్ పోల్స్‌ను గుర్తించారు. మోటర్లకు కెపసిటర్స్ ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, మోటర్ల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని లూస్ కనెక్షన్స్, జాయింట్ వైర్లు చూసుకోవాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం వంగిన స్తంభాలు సరి చేశారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ నర్సింగరావు, ఎల్ఐ లక్ష్మణ్, లైన్‌మెన్ నెల్కి మల్లేష్ పాల్గొన్నారు.

నిందితుడిని బహిరంగంగా శిక్షించాలి

- ఆదివాసుల భారీ ర్యాలీ
- నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన
- డీఎస్పీకి ఆదివాసుల వినతి



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బతుకుదెరువు కోసం ఏజెన్సీ ప్రాంతాల్లోకి వచ్చిన వారు అదే ఆదివాసులపై హత్యలు, అత్యాచారాలు చేస్తున్నారని, తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. జైనూర్ ఘటనలో నిందితుడిని బహిరంగంగా శిక్షించడంతో పాటు బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు. నోటికి నల్ల గుడ్డలతో ర్యాలీ నిర్వహించారు. కుమురంభీం కాలనీ నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ డీఎస్పీ కార్యాలయం వరకు సాగింది. అనంతరం డీఎస్పీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో చట్టాలున్న వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని, దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. బతుకుదెరువు కోసం వచ్చి లవ్ జీహద్ పేరిట ఆదివాసులను మచ్చిగా చేసుకొని భూములను తీసుకుంటున్నారని ఆరోపించారు. జైనూర్ ఘటన బీఆర్ఎస్, బీజేపీలు చేశారని, ఆరోపణలు సరికావని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వలసలను అరికట్టడంతో పాటు, రక్షణ కల్పించి చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తదుపరి జరిగే పరిమణాలను బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాదితురాలికి ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేస్తు నోటికి నల్ల గుడ్డలతో ర్యాలీ నిర్వహించి, డీఎస్పీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు వరుణ్, ఉయిక ఇందిరా, గోడం రేణుక, లలిత, ప్రకాష్, గోవిందరావు, రామచందర్, ఉయిక సంజీవ్ పాల్గొన్నారు.

ఆదివాసీ సేన ఆధ్వర్యంలో...

జైనూర్ మండల కేంద్రంలో 1950 తర్వాత అక్రమంగా వలస వచ్చిన వారిని వెంటనే మైదాన ప్రాంతానికి తరలించాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్ డిమాండ్ చేశారు. గురువారం గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఆదివాసులతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి, హత్యచేసి దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రికరించిన దుండగుడిని వెంటనే బహిరంగంగా శిక్షించాలన్నారు. బాధిత మహిళకు ప్రభుత్వమే మెరుగైన వైద్యమందించి తగు నష్టపరిహారాన్ని చెల్లించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు ప్రాణనష్టం జరిగినచో ఆదివాసీ సమాజం, అన్ని ఆదివాసీ సంఘాలతో కలిసి ఏజెన్సీ ప్రాంతంలో త్రీవ ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు మెస్రం నాగ్‌నాథ్, ఉమ్రి సార్మేడి కాల్లె భరత్, ఆదివాసీ సేన మండల అధ్యక్షులు సెడ్మకి భీంరావ్, తుడుం దెబ్బ మండల కార్యదర్శి పెందోర్ జగన్, తుడుం దెబ్బ మండల ఉపాధ్యక్షులు మందాడి నాగేశ్వర్, తుడుం దెబ్బ మండల ఉపాధ్యక్షులు చీర్మడి ముంజాజీ, నాయకులు ఉన్నారు.

నార్నూర్ : ఇటీవల జైనూర్‌లో ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి హత్యాయత్నం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఫాస్ట్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలన్నారు. గురువారం నార్నూర్ మండల కేంద్రంలో సీఐ రహీమ్ పాషా, గాదిగూడ మండల కేంద్రంలో ఎస్సై మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. కుమురంభీం భవనం నుంచి పోలీస్ స్టేషన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. 1950లో వలస వచ్చిన ముస్లిం మైనారిటీల భూయాజమాన్య హక్కు పత్రాలు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు వెంటనే రద్దు చేసి, జైనూర్ ఏజెన్సీ ప్రాంతం నుంచి వారిని అక్కడి నుంచి తరలించాలన్నారు. పేసా చటం అమలు చేయాలని, అక్రమ వలసలను అరికట్టాలని, సంఘటనలో ఆదివాసులపై ఎదురు దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళ సంఘాల నాయకులు ఆత్రం నాగుబాయి, సిడం సుభద్ర బాయి, గీత బాయి, పూసం యమున బాయి, తొడసం ద్రుపతబాయి, పూసం రాధబాయి, పూసం సుంగాబాయి, పెందుర్ దీపిక, రవతిబాయి, ఆత్రం పతుబాయి, పెందుర్ సారజా, కమలాబాయి, తుడందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, రాయిసెంటర్ సార్మేడి మందాడి దౌలత్‌రావ్, కొడప జాకు, మడావి చంద్రహరి, పూసం బాదిరావ్, మడావి నటరాజ్, సోయం మారుతి, పెందుర్ సంతోష్, పెందుర్ మధు, శంభు, మరప్ప గంగారాం, అడ శ్రీరాం ఉన్నారు.



ఉట్నూర్

ఉట్నూర్ : తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలని, ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు పెందోర్ పుష్పారాణి అన్నారు. గురువారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ నాగేందర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. శాంతి యుతంగా, మౌనంగా పాదయాత్రగా వెళ్లి డీఎస్పీని కలిసి వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన దుండగుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో అతను ఎక్కడ కనబడిన మహిళలు అందరూ కలిసి అతనికి అడ్రస్ లేకుండా చేస్తామని అన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి వెంటనే శిక్షించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిడం కౌసల్య, ప్రియాంక, నీలాబాయి, అన్నపూర్ణతో పాటు సీఐ మొగిలి, ఎస్సై మనోహర్, పోలీసు సిబ్బంది, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



నార్నూర్

నూతన విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సాలేగూడ గ్రామంలో ఎస్ఈ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం కరెంట్ మీటర్ల కోసం దరఖాస్తులను స్వీకరించారు. కరెంట్ మీటర్లు లేని వారిని గుర్తించి మీటర్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. రెండు రోజుల్లో విద్యుత్ మీటర్లు బిగించడం జరుగుతుందన్నారు. రూ.938కి మీటర్ అందించడం జరుగుతుందని, మండలంలో ఇంకా మీటర్లు లేని వారు విద్యుత్ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకొని మీటర్లు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి డీఈ రాజన్న, ఏఈలు స్వర్ణలత, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ప్రభుదయ

నవతెలంగాణ-వాంకిడి

మండల ఎంపీడీఓగా ప్రభుదయ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన నజ్రుల్ ఉల్లాఖాన్ బెజ్జూరు మండలానికి బదిలీ కాగా సిర్పూర్(యు) మండలంలో పని చేస్తున్న ప్రభుదయ మండల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అన్నివేళల అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

వృద్ధులకు ఆరోగ్య బీమా ప్రకటన హర్షణీయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ప్రవేశపెట్టిన రూ. 5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా పథకం హర్షణీయమని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పథకం వల్ల దేశంలోని అనేక మంది వయోధికులు లబ్ది పొందే అవకాశం ఉందని, దీనిని ఏకగ్రీవంగా ఆమోదించిన కేంద్ర కేబినెట్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు ఎఎస్ఆర్ మూర్తి, నారాయణ, రమణయ్య, పురుషోత్తం, బి నర్సయ్య, పుర్క సీతారాం, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంజేపీలో గణేష్ నిమజ్జన వేడుకలు



నవతెలంగాణ - హాజీపూర్

గుడిపేట్‌లోని మహాత్మా జ్యోతి బాపులే బీసీ గురుకులంలో గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురుకులంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని గురువారం నిమజ్జనం చేశారు. విద్యార్థులు గణపతి పాటలతో కేరింతలు కొట్టారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సేరు శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలో ఏర్పాటు చేసిన పలు వైద్య శిబిరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం అయినందున ప్రజా సంక్షేమం దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 55 గ్రామాలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నామన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందితో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలతో పాటు డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా సంబంధిత శాఖల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అనుమానితుల నుండి రక్త నమూనాలు సేకరించి పరీక్షల అనంతరం వైద్య చికిత్సలు అందిస్తున్నామని, ప్రజలు భయాందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, జ్వర లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ భాస్కర్, ఎంపీడీఓ శ్రీనివాస్, డీఎల్‌పీఓ ఉమర్ హుస్సేన్, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో మరింత ముందుకెళ్లొచ్చు



నవతెలంగాణ-కాసిపేట

అక్షరాస్యత ద్వారా ఆత్మవిశ్వాసంతో మరింత ముందుకెళ్లొవచ్చని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోపి ధర్మారావుపేట, మల్కపల్లి, దేవాపూర్ గ్రామాల్లో జిల్లా వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్, సఖి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యత కేంద్రాలు, ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, చేసే పనిని ప్రణాళికబద్ధంగా చేపట్టి విజయవంతంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. అక్షరాస్యత కేంద్రాల ద్వారా నిరక్షరాస్యులను 100 రోజులలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని, ప్రతి గ్రామంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించినప్పుడే మానవ జీవన విధానం, నాగరికత, నవకల్పన జరుగుతుందని తెలిపారు. అక్షరాస్యతతో పాటు స్వయం సమృద్ధి, ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో అందిస్తున్న కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వయోజన విద్యాశాఖ ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి అభ్యాసన కేంద్రాలు ఏర్పాటు చేసి, చదువుతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం, రోజువారి పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా రిసోర్స్ పర్సన్స్ అదనంగా పని చేసి అక్షరాస్యత పెంపుదలకు కృషి చేయడం, ఇందుకు లయన్స్ క్లబ్ సఖి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, డివిజనల్ పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, సెక్టర్ అధికారి సత్యనారాయణమూర్తి, లయన్స్ క్లబ్ సఖి అధ్యక్షులు బండ శాంకరి, డీఆర్పీలు పోకల వెంకటేశ్వర్లు, ఎర్ర సువర్ణ, కొండు జనార్ధన్, కందుల తిరుపతి, సుమన్, సమన్వయకర్తలు సంధ్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లకు కౌన్సెలింగ్



నవతెలంగాణ-లక్సెట్టిపేట

పట్టణంలో ఇటీవల పేకాట ఆడుతూ పట్టుబడిన ఐదుగురు యువకులకు లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పేకాట ఆడి విలువైన జీవితాలని నాశనం చేసుకోకూడదని, యువత సత్ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. ఏదైనా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోవాలని సూచించారు. మొదటి సారి తప్పుగా భావించి యువత జీవితాలని దృష్టిలో పెట్టుకొని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. మరోసారి తప్పు చేసినా పేకాట ఆడినట్లు తెలిసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సీఐ వెంట లక్సెట్టిపేట ఎస్సై సతీష్ ఉన్నారు.

పీఎంకేవీపై కలెక్టరేట్‌లో సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీ)పై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా ఎన్ఎస్‌డీసీ ప్రశాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌డీసీ ప్రశాంత్ పీఎంకేవీపై గురించి క్లుప్తంగా వివరించారు. ఈ పథకం 15 సంవత్సరాల నుండి ఆ పైబడిన నిరుద్యోగ యువత, పాఠశాల లేదా కళాశాల డ్రాపౌట్‌లను ఉపాధికి సరిపోయేలా చేయడానికి ఖర్చు-రహిత, పరిశ్రమ-సంబంధిత నైపుణ్య శిక్షణను అందిస్తుందని తెలిపారు. ఈ పథకం చెల్లుబాటు అయ్యే ధృవీకరణ స్కిల్ ఇండియా కార్డును అందిస్తుందనీ, దీని ఆధారంగా అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని, జీవనోపాధిని పొందవచ్చునని వివరించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాల, పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఈ స్కిల్ డెవలప్మెంట్ కోర్సును మొదటిసారిగా ప్రారంభించుకోబోతున్నామని అందుకు ఆయా కళాశాల, పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఏ కోర్సులో ప్రవేశానికి ఇష్టపడుతున్నారో తెలుసుకొని కోర్సుల వారీగా ఐడెంటిఫై చేయాలన్నారు. కోర్సుల వారీగా 10 నుండి 40 మంది విద్యార్థులు ఉండాలని ఒరియంటేశన్ ద్వారా తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ ప్రణీత, ఆయా కళాశాల పాఠశాలల ప్రిన్సిపాళ్ల, టీచర్స్ ఉన్నారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు

- నిందితున్ని అరెస్ట్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడలో సొంత అన్నని హత్య చేసిన నిందితున్ని గురువారం పోలీసులు అరెస్టు చేసినట్టు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. నిర్మల్‌లోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్థానిక మహాలక్ష్మీవాడలో నివాసముండే డుక్రే శివాజీ అలియాస్ శివ, డుక్రే సాంబాజి వరసకి అన్నదమ్ములవుతారని తెలిపారు. డోక్రి సాంబాజి తాగుడికి బానిసై రోజు తన తమ్ముడితో గొడవపడేవాడని తెలిపారు. ప్రతిరోజు గొడవపడుతున్న విషయాన్ని మనసులో పెట్టుకొని అన్నను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నాడని తెలిపారు. బుధవారం అర్ధరాత్రి అక్క ఇంటి వద్ద సాంబాజి తమ్ముడు శివని డబ్బులు ఇవ్వమని, గొడవ చేసినట్టు తెలిపారు. దీంతో కోపోద్రిక్తుడైన శివ తన వద్ద ఉన్న గొడ్డలితో సాంబాజి తలపై కొట్టగా అతను అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. బాధితుడి అక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు శివని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సమావేశంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి



అనారోగ్యం, అప్పుల బాధతో పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన బానావత్ గణేష్(42) లివర్ చెడిపోయి చికిత్స కోసం అప్పులు చేశాడు. వైద్యం చేయించుకున్న నయం కాకపోవడం, అప్పులు పెరుగుతుండటంతో మానసిక క్షోభకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం పొలానికి వెళ్లి అక్కడే గడ్డి మందు తాగి పడిపోగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.

టేకు చెట్లను నరికిన 8 మందిపై కేసు

నవతెలంగాణ-జన్నారం

లోతొర్రి బీట్‌లో ఈ నెల 10న గుట్టు చప్పుడు కాకుండా నాయకపుగూడకు చెందిన ఎనిమిది మంది 3 టేకు చెట్లను 13 ముక్కలుగా తయారుచేసి ఇతరా ప్రాంతాలకు తరలిస్తున్నారని సంచారంతో సిబ్బంది పట్టుకోవడం జరిగిందని ఇందపల్లి రేంజ్ ఆఫీసర్ హఫీనోద్దీన్ తెలిపారు. చెట్లను నరికి సంగ్లింగ్ పాల్పడిన నాయకపుగూడకు చెందిన కోమర గట్టయ్య, ముచినేని బాపు రావు, కొమెర రాజన్న, గట్టయ్య, మహేష్, కిట్టు, మేక నరేష్‌లపై కేసు నమోదు చేశామని, త్వరలో రిమాండ్‌కు పంపిస్తామన్నారు. నరికిన దిమ్మల విలువ రూ.38 వేలుంటుందని ఆ కలపను తమ ఆధీనంలోకి తీసుకోవడం జరిగిందని ఎఫ్ఆర్ఓ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నవతెలంగాణ-బేల

మండలంలోని దహెగాం శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు గురువారం బేల ఎస్సై తమ పోలీసు సిబ్బందితో పేకాట ఆడుతున్న ప్రదేశానికి వెళ్లి ఆ స్థావరంపై దాడి చేయగా, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు వ్యక్తులు పోలీసులను పారిపోయారు. పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.9160 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాధిక తెలిపారు.

పద్మశాలి సభ్యత్వ నమోదు ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణ పద్మశాలి సేవా సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నుండి ప్రారంభించినట్లు ఆ సంఘం అధ్యక్షులు దాసరి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభ్యత్వ నమోదు గురువారం నుండి ఆదివారం వరకు కొనసాగుతుందని, ప్రతి రోజు ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ద్వారకానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు సంఘంలో సభ్యత్వం తీసుకోని వారు తమ ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో వచ్చి ఉచితంగా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9949446778 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.